కథ

# సావాసం

నెల్లుట్ల రుక్మిణి
90004 41271

"అమ్మగారూ.." రాజమ్మ పిలుపుతో, చేనంతా కలియ చూస్తున్న జానకమ్మ ఉలిక్కిపడింది.

"ఈ మిరప చేను మాదే అమ్మగారూ! అరెకరం ఉంటది. మిర్చి ఏరడానికి కూలి మడుసులు దొరుకుతలేరు. అందరి తోటలు ఇప్పుడే కోత కొస్తయి కదా! గందుకని కైకిలికి కొద్దిమందే దొరికిండ్రు" అన్నది రాజమ్మ.

మిరప తోటలో ఎర్రగా పండిన మిరపపండ్లు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఊరికి దగ్గర లోనే ఉన్నది ఆ చేను.

"ఏం పని లేకుండ, ఇంటికాడ ఉత్తగనే కూసుంటే ఏం తోస్తది అమ్మగారూ! పాత ఇసయాలన్నీ యాది కొచ్చి గుబులైతుంటది. జర గిట్ల అటు, ఇటు తిరుగుతా ఉంటే మదికి కాస్త ఊరట వస్తది. గందుకనే నిన్ను ఇక్కడికి తోలుకొచ్చిన" అన్నది రాజమ్మ.

లింగాపురం చిన్న గ్రామం. ఒంపు వీధిలో జానకమ్మ ఇంటి ఎదురుగానే రాజమ్మ ఇల్లు, ఆమె బంధువుల ఇళ్లు ఉన్నాయి. జానకమ్మ వాళ్లు శ్రీవైష్ణవులు. వాళ్ల తాతల కాలం నుంచి గుడి పూజారులుగానే బతికారు. జానకమ్మ మామగారు తిరువెంగళాచార్యులు. మహా పండితుడు, వేదాధ్యయనం చేసినవాడు. రజాకార్ల హడావుడికి ముందు, పక్కూరి వెంకట్రామిరెడ్డి దొర తిరువెంగళాచార్యుల పాండిత్యానికి మెచ్చి, తమ ఊరి ఆలయానికి అర్చకుడిగా ఉండమని ఆహ్వానించాడు. కానీ, తిరువెంగళాచార్యులు తమ స్వగ్రామమైన లింగాపురం విడిచి వెళ్లడానికి ఇష్టపడలేదు. అందువల్ల వెంకట్రామిరెడ్డి దొర, లింగాపురంలోనే వరదరాజ స్వామి గుడి కట్టించి ఇచ్చాడు.

రజాకార్ల కారణంగా జనజీవనంలో బాగా అస్తవ్యస్తత ఏర్పడటంతో దాని ప్రభావం తిరువెంగళాచార్యుల కుటుంబం పైన కూడా పడింది.

అతని కుమారుడైన వరదాచార్యులు కూడా తండ్రితోపాటు గుడికి వెళ్లేవాడు. అలా వెళుతూ అర్చకత్వం, పౌరోహిత్యం నేర్చుకున్నాడు. ఆ ఊరిలో శ్రీవైష్ణవుల కుటుంబాలు, బ్రాహ్మణుల కుటుంబాలు మరో నాలుగు ఉన్నాయి.

కాలక్రమేణా దొర ఏర్పాటు చేసిన గుడిమాన్యం, ఊరి రాజకీయాలలో హరించుకుపోయింది. తిరువెంగళాచార్యుల అనంతరం వరదాచార్యులు అర్చకత్వానికి వచ్చేసరికి.. గుడికి వచ్చే ఆదాయం శూన్యమైపోయింది. గుడిలో రోజూ దీపం ముట్టించాలన్నా.. వరదాచార్యులే తన చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వరదాచార్యులకు జానకమ్మతో వివాహం జరిగిన తర్వాత, కుటుంబ జరుగుబాటే కష్టమైపోయింది. గుడి అర్చకత్వంతోను, పౌరోహిత్యంతోను, ఒక కుటుంబం జీవించగలగడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈలోగా కొడుకు వెంకటాచార్యులు, కూతురు గోదాదేవి జన్మించారు.

"ఏమండీ! ఈ అర్చకత్వంతో మనం బతకడం, పిల్లలను చదివించుకోవడం కష్టం అవుతూ ఉంది కదండీ. మన ఊర్లో ఉన్న మన బంధువులు, బ్రాహ్మణ కుటుంబాలు కూడా పట్నానికి వలస పోతున్నారు కదండీ. మనం కూడా పట్నానికి వెళ్లి బతుకుదెరువు వెతుకుందామండీ" అంటూ బతిమిలాడింది జానకమ్మ.

"ఈ వరదరాజ స్వామి గుడి, అర్చకత్వం మా తండ్రిగారి కోరిక మేరకు మన కుటుంబానికి లభించిన అదృష్టం. ఇదంతా వదిలేసి, ఇప్పుడు అర్ధాంతరంగా వెళ్లిపోతే ఆయన ఆత్మ శాంతిస్తుందంటావా జానకీ " అన్నాడు వరదాచార్యులు.

"ఆత్మల శాంతికోసం ఆలోచిస్తే, మన ఆత్మారాముడు ఎలా శాంతిస్తాడండీ? పిల్లలకు రెండు పూటలా కడుపు నిండా తిండి పెట్టుకోవాలి కదా? పట్నంలో ఏదో ఒక పని చేసుకొని బతకవచ్చు. ఈ ఊర్లోనే ఉంటే.. అయ్యగార్లుగా, పూజారి కుటుంబీకులుగా మనకు కూలి పని కూడా దొరకదు. కాస్త పిల్లల మొహం చూసి ఆలోచించండి. అంతా బాగుంటే మళ్లీ ఇక్కడికే వచ్చేద్దాం" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ.

మనస్ఫూర్తిగా ఇష్టం లేకపోయినా తలపంకించాడు వరదాచార్యులు. జానకమ్మకు అదే పరమ సంతోషం. పట్నం వెళ్లడానికి సామాన్లు సర్దడం మొదలుపెట్టింది.

మర్నాడు ఉదయం జానకమ్మ.. మామగారైన తిరువెంగళాచార్యుల పటం తీసి తుడుస్తూ ఉంటే ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"అమ్మగారూ.. అమ్మగారూ! అయ్యగారు గుడిలో పడిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేడు" గట్టిగా అరిచి చెప్పాడు ఆ వ్యక్తి.

ఈ అరుపులకు, అలికిడికి రాజమ్మ బయటికి వచ్చింది.

"ఏమైందిరా మల్లిగా! అయ్యగారికి ఏమైంది?" అడిగింది రాజమ్మ.

"ఏమోనత్తా! గంట కొట్టుకుంటా కొట్టుకుంటా గట్లనే పక్కకు ఒరిగిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేడు" అన్నాడు మల్లిగాడు.

"అమ్మగారూ పద.. పొయ్యి చూద్దాం" అంటూ జానకమ్మను తీసుకొని వెళ్లింది రాజమ్మ.

గుడిలో అచేతనంగా పడి ఉన్నాడు వరదాచార్యులు. రాజమ్మ మల్లిగాణ్ని పంపించి, ఆ ఊర్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టరును

